క్లుప్తంగా

పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండు అర్ధ సంవత్సరాల పన్ను ఏక మొత్తంగా ఒకేసారి ఏప్రిల్ 30వ తేదీలోపు చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తుందని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఇంటి, ఖాళీ జాగాల పన్నులను నగర సేవా యాప్, సచివాలయం, ఆన్‌లైన్ ద్వారా గానీ, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో గానీ చెల్లించవచ్చన్నారు. సెలవు దినాల్లో కూడా ఈ కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం అవసరం

– ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం చేయాల్సి ఉంటుందని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్ రెడ్డి, ఓం శాంతి ప్రతినిధి ప్రదీప అక్కయ్యలు తెలిపారు. కడప ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో డ్రైవర్లకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్ చేసే డ్రైవర్లు, ఇంధన పొదుపు పాటించని వారికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి డ్రైవర్ పంచ సూత్రాలను పాటించి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ, ఎస్‌డీఐ కృష్ణారెడ్డి, పులివెందుల డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్‌రెడ్డిలు డ్రైవర్లను బస్సుల్లో తీసుకెళ్లి రహదారి సిగ్నల్స్‌పై నిబంధనలు, ఇంధన పొదుపునకు సంబంధించిన మెలకువలను తెలియజేశారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలోని బోయినపల్లె అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రేణుక మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. కడపలోని తమ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సంవత్సర కాలంలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారన్నారు. కళాశాల యాజమాన్యం ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తోందని ఆరోపించారు. అన్నమాచార్య కళాశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్ నడుపుతున్నారన్నారు.విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్రబాబు, వెంకటేష్,, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన


మంటలు ఆర్పి అవగాహన కల్పిస్తున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి

కడప అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.బసివిరెడ్డి, సిబ్బంది మంగళవారం కడప నగర శివారులోని ఈగల్ డిస్టిల్లరీస్‌లో పని చేస్తున్న మహిళలకు ఎల్‌పిజీ గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మహిళలకు మొదట ఎల్‌పిజీ గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే ఎలా ఆర్పివేయాలి? అగ్ని ప్రమాదాలు సంభవిస్తే కార్బన్‌డయాక్సైడ్ నిండిన పరికరంతో ఎలా మంటలను అదుపులోకి తీసుకురావాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ జీఎం మహేశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు బోర్లకు అనుమతులు నిలుపుదల

కడప కార్పొరేషన్ : కడప నగరలో ప్రైవేటు బోర్లకు అనుమతులు నిలిపివేసినట్లు నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పోయిన కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెన్నానదిలో నీటి మట్టం అడుగంటి పోయి కడపకు త్రాగునీటి సరఫరా చేసే లింగంపల్లి, గండి, రామనపల్లె బుగ్గ లోకల్ బోర్లలో నీటి కొరత ఏర్పడిందన్నారు. గండికోట నుంచి మైలవరానికి, మైలవరం నుంచి లింగంపల్లె, గండి వాటర్ వర్క్స్, రామనపల్లె పంప్ హౌస్ వరకూ నీటిని వదలడం జరిగిందన్నారు. ఈ చర్యలతో సాధారణ నీటి సరఫరా ఉందని, ప్రజలు పొదుపుగా ఉపయోగించుకోవాలని కోరారు.

సీతారామ కల్యాణానికి వేదికలు ముస్తాబు


శ్రీరామ నవమిని ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన స్వాగతం తోరణం


హౌసింగ్‌బోర్డు కోదండ రామాలయంలోని కల్యాణ వేదిక

కడప కల్చరల్ : నగరంలోని రామాలయాలు సీతారామ కల్యాణానికి ముస్తాబయ్యాయి. నిత్యం పూజాదికాలు, భక్తులతో కళకళలాడే రామాలయాలన్నీ శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేకంగా సిద్ధమయ్యాయి. కడప నగరంలో పండగ సందర్భంగా దాదాపు అన్ని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.నగరంలోని అన్ని వైష్ణవాలయాల్లో పండుగ నిర్వహణ కోసంఆలయ కమిటీ పెద్దలు, భక్తబృందాలు, యువ భక్తుల బృందాలు అవసరమైన సరంజామా సేకరణలో నిమగ్నమయ్యారు. పలు ఆలయాల వద్ద పందిళ్లు కళకళలాడుతున్నాయి.

ఘనంగా ఏర్పాట్లు

బుధవారం ఉదయం 10 గంటల నుంచి అన్ని రామాలయాలలో శ్రీరామ నవమి పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద, ప్రధాన రోడ్లు, కూడళ్లలో ఇప్పటికే భారీ హోర్డింగ్‌లు, దేవతామూర్తుల కలర్ లైట్లతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పండగ శోభ ఉట్టిపడుతోంది. మామిడాకుల సేకరణ, పానకం, వడపప్పు తయారీలో యువ భక్తుల బృందాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో కొన్ని దేవాలయాలలో నవమి సందర్భంగా భక్తులందరికీ అన్నదానం నిర్వహించనున్నారు.

నగరంలో..

కడప నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోగల కోదండ రామస్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వేడుక ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల్లోపు సీతారామ కల్యాణం నిర్వహించు కునేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. 18న రాత్రి 7 గంటలకు సీతారాముల మహాపట్టాభిషేకం, 19న రాత్రి 7గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. అలాగే జవుళి బజారులోనికోదండ రామాలయం, నాగరాజుపేట బేల్దారివీధికోదండ రామాలయం, నెహ్రూనగర్ రామాలయం, ఆంజనేయ స్వామివీధి కోదండ రామాలయం, నాగరాజుపేట కోదండ రామాలయం, సింహపురి కాలనీ, రవీంద్రనగర్‌లోని సీతారామాలయం, హబీబుల్లావీధిలో శారదా నిలయం హైస్కూలు వద్దగల సీతారామస్వామి ఆలయం, అరవిందనగర్ రామాలయం , మారుతినగర్ సీతారామలయం, భాగ్యనగర్ రామాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించనున్నారు.

ఉప ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా చేస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. కడప నగరంలోని 8వ డివిజన్ శంకరాపురంలో స్థానిక కార్పొరేటర్ ఏ.బాలక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు డిప్యూటీ సీఎంకు భారీ గజమాల వేసి, పూలు జల్లి స్వాగతం పలుకగా, మహిళలు మౌలానీ, సునీత ఆయనకు హారతులిచ్చి, దిష్టితీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాణా ప్రతాప్, రామ్మోహన్‌రెడ్డి, సమరనాథరెడ్డి పాల్గొన్నారు.


8వ డివిజన్ శంకరాపురంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు హారతులిస్తున్న మహిళలు

సంక్షేమ పాలనకు ఓటేయండి

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు ఓటేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు కోరారు. స్థానిక ఒకటో డివిజన్‌లోని వాటర్ గండి, ఎస్టీ కాలనీ, ఎంఎస్ కొట్టాల ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారే తమకు స్టార్ క్యాంపెయినర్లని, వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. అప్పుడే ఈ సంక్షేమ పథకాలన్నీ మళ్లీ కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఆర్. చెన్నయ్య, హఫీజుల్లా, సీహెచ్ వినోద్, సుదర్శన్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, కంచుపాటి బాబు, గోపాలక్రిష్ణ, ఆర్‌వీ రమణ, లక్ష్మినారాయణ, బాదుల్లా, అర్జున్, నాగరాజు, బి.క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వాటర్ గండిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు

నవరత్నాలు...

ఆంధ్రుల ప్రగతికి రథ చక్రాలు

ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు.. ఆంధ్రుల ప్రగతికి రథ చక్రాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. స్థానిక 7వ డివిజన్‌లోని భారతీ బార్ వీధి, శంకరాపురంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు చూసిన జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ఇంటి వద్దనే వాటిని అందజేశారన్నారు. కులమతాలు, పార్టీలవివక్ష లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించారన్నారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే తలుపుతట్టి అవ్వాతాతలకు, దివ్యాంగులకు పింఛన్ ఇచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కడప నగరాభివృద్ధికి నయాపైసా ఇచ్చిన పాపాన పోలేదని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.2400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రహదారులను విస్తరించి, కూడళ్లను అందంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ ఇన్‌చార్జి గంగరాజు, ప్రసాద్, వైఎస్సార్‌సీపి నాయకులు పి జయచంద్రారెడ్డి, రాణాప్రతాప్, రామ్మోహన్‌రెడ్డి, కె.కొండయ్య, ఏ.బాలక్రిష్ణారెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, దాసరి శివప్రసాద్, షఫీవుల్లా, మధు, జఫ్రుల్లా, అహ్మద్, ఉమామహేశ్వరి, నారాయణమ్మ, సునీత, తులశమ్మ, జింకా జయలక్ష్మి, మల్లీశ్వరి పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్


కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. స్థానిక అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్, దేవునికడప రోడ్డు, అల్మాస్ పేట ప్రాంతాల్లో పారిశుద్ధ్య, ఇతర అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అన్నమయ్య జంక్షన్ వద్ద ఫౌంటెయిన్ మోటార్ పనులు పూర్తి చేసి, మొక్కలు నాటించాలన్నారు. క్రిష్ణా సర్కిల్ వరకూ డ్రైన్‌పై స్లాబ్ వేయాలన్నారు. క్రిష్ణా సర్కిల్‌లో ర్యాంప్ వర్క్ పూర్తి చేయాలని, అక్కడి నుంచి గోకుల్ లాడ్జి వరకూ రోడ్డుకు మార్కింగ్ ఇవ్వాలన్నారు. దేవుని కడప రోడ్డులో గౌస్ నగర్ స్కూల్ వద్ద డ్రైన్ పనులు వెంటనే పూర్తి చేయాలని, మార్కెట్ యార్డు నుంచి గౌస్ నగర్ వరకూ అప్రోచ్ రోడ్డు, కాలువలు నిర్మించాలన్నారు. మాచుపల్లె ప్లాజా వద్ద ఫౌంటెయిన్‌కు రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, మార్బుల్‌ను డిజైన్ ప్రకారం వేయాలన్నారు. అల్మాస్‌పేట సర్కిల్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి డోమ్ యందు పెయింటింగ్ వేయించాలన్నారు. అల్మాస్ పేట జంక్షన్ చుట్టూ అప్రోచ్ రోడ్డు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, రోడ్లు, భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

పులివెందుల టౌన్ : జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీరామాహాల్ రోడ్డు, నెహ్రూనగర్, చౌడమ్మవీధి, మారుతిహాల్‌రోడ్డు, సుంకులమ్మ ఆలయం, బొగ్గుడుపల్లె తదితర ప్రాంతాల్లో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ కోడిరమణ ఆధ్వర్యంలో వారిని గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంటుకు పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, జేసీఎస్ ఇన్‌చార్జులు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, కోఆప్షన్ చంద్రమౌళి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డేనియల్‌బాబు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, వార్డు కన్వీనర్ శ్రీరంజన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బొగ్గుడుపల్లె నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రహ బాధల నుంచి తప్పించు తల్లీ!

కడప కల్చరల్ : గ్రహ బాధల నుంచి తమను తప్పించాలని కోరుతూ మహిళా భక్తులు పెద్ద ఎత్తున విజయదుర్గాదేవిని ప్రార్థించారు. కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో దోష నివారణ కోసం మంగళవారం భక్తులు రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా రాహుకాల పూజల్లో పాల్గొన్నారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


విశేష అలంకారంలో విజయదుర్గమ్మ

వీరేశలింగం సేవలు ప్రశంసనీయం

కడప కల్చరల్ : కందుకూరి వీరేశలింగం సేవలు ప్రశంసనీయమని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలవేసి మంగళవారం నివాళులర్పించారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రంగస్థల నాటకం సర్వజన శ్రేయస్సు కోరిందని, నాటితరంలో ప్రజల నుంచి ఎంతో ఆదరణ పొందిందన్నారు. తొలి నాటక కర్త, దర్శకుడు, ప్రదర్శకులు అయిన కందుకూరి జన్మదినాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు నాటక రంగ దినోత్సవంగా నిర్ణయించడం ఈ రంగానికి దక్కిన గౌరవంగా భావించవచ్చన్నారు. ఆయన నాటక రంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయిత ప్రొద్దుటూరు నాగరాజు, రంగస్థల నటీమణి సింగంశెట్టి అరుణకుమారి, రంగస్థల కళాకారులు జీవకళ సత్యనారాయణ, గంగులప్ప గారి వెంకటరమణ తాము నాటక రంగంలో ప్రవేశించిన నేపథ్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కళాకారులు ప్రకాశం, మురళి, బాల ఓబయ్య, రామసుబ్బయ్య పాల్గొన్నారు.


రంగ స్థల కళాకారులను సత్కరిస్తున్న వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు


వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వైవీయూలో ఘనంగా నాటక రంగ దినోత్సవం

వైవీయూ : సమాజాభివృద్ధికి, సామాజిక స్పృహను రగిలించడంలో నాటకం అద్వితీయమైన పాత్ర పోషిస్తోందని యోగివేమన విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య కంకణాల గంగయ్య అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని వైవీయూ లలిత కళల శాఖ, రంగస్థల కళల విభాగాధిపతి డాక్టర్ కోట మత్యుంజయరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కె.గంగయ్య మాట్లాడుతూ నాటకం సజీవమైందన్నారు. సురభి నాటక సమాజం కడప జిల్లా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిందన్నారు. ఐటీ సెల్ సంచాలకులు తుమ్మలకుంట శివప్రతాప్ మాట్లాడుతూ రంగస్థల నటుడిగా రాణించాలంటే కావాల్సిన మెళకువలను వివరించారు. లలిత కళల శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య వినోదిని మాట్లాడుతూ పండితుల నుంచి పామరుల వరకు అర్థం చేసుకునేది ఒక్క నాటకమేనన్నారు. తెలుగు శాఖ విభాగాధిపతి ఆచార్య పార్వతి మాట్లాడుతూ లలిత కళల విద్యార్థులు గొప్ప నాటకకర్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. నటుడు మాజేటి వెంకట నాగలక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నాటకం ఇచ్చే ఆనందాన్ని సినిమా ఇవ్వదన్నారు. విదేశాల్లో సజీవంగా ఉన్నాయని మనదేశంలో ఆదరణ తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నటుడు కోడికూతల ఓబులేసు మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలపై నాటకాలు విల్లు ఎక్కుపెడతాయన్నారు. అనంతరం మాజేటి వెంకట నాగ లక్ష్మీప్రసాద్, కోడికూతల ఓబులేసులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ ఆచార్యులు డా. పాలెం రమాదేవి, లలిత కళల విభాగం అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ కె. రెడ్డిశేఖర రెడ్డి, వి. సుధాకర్, సి. వెంకటేష్, బి. చినరాయుడు, ఎస్. చంటి, యం. వాసవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప నటులకు కాణాచి


నాగమునిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, కళాకారులు

కడప కల్చరల్ : గొప్ప నాటక కర్తలు, నటులకు రాయలసీమ కాణాచిగా ఉందని ప్రముఖ రంగస్థల నటుడు యస్.నాగముని (మధుబాబు) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో నాగముని 'రాయలసీమ నాటకం – నాటక రంగం' అంశంపై ప్రసంగించారు. కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగముని మాట్లాడుతూ సురభి నాటక కళాకారులే రాయలసీమలో నాటకరంగానికి ఆద్యులని కొనియాడారు. తమ పాత్రల్లో పరకాయప్రవేశం చేసి రాయలసీమ ఖ్యాతిని ఇనుమడిరపజేశారన్నారు. అనంతరం నాగమునిని పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామ ప్రసాద రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణసత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.హరిభూషణ రావు, గానుగపెంట హనుమంతరావు, పుత్తా పుల్లారెడ్డి, డా వెల్లాల వేంకటేశ్వరాచారి, కొత్తపల్లి రామాంజనేయులు, మాచిరాజు రమణయ్య, భూపతి రాయల్, బాలయల్లారెడ్డి పాల్గొన్నారు.